# ''దట్ ఉమన్''

ఆ ఇంట్లోంచి రెండు కంఠాలు బాగా తారస్థాయిలో వినిపిస్తున్నాయి.

ఒకటి పురుషకంఠం, రెండోది స్త్రీ కంఠం. మధ్య మధ్య ఏడుస్తూ. అది వనజది. ''నేను చెయ్యను. చెయ్యలేను. రోజంతా మీకూ, పిల్లకి చేసి నాప్రాణం పోతోంది. ఏం పచ్చడి లేకపోతే ప్రాణం పోతుందా? మళ్ళీ నూనైపోయిందా, ఖర్చు తగ్గించమని ఒకటే గోల! కంచంలోకి పిండివంటలు కావాలి కానీ తెమ్మంటే సత్తువ చాలదు... ఏది పెడితే అది తినండి... నా దగ్గర గారడీ లేదు... మీరు అన్నట్లల్లా చెయ్యటానికి... వస్తువుంటేనే వండుతాను... నూనెలూ, వంటలూ పుట్టించలేను...''

''పోనీగదా అని ఊరుకుంటే పొగరు బాగానే నెత్తికెక్కింది.

ఇప్పుడే బజారునుంచి తెచ్చాను... కొత్తిమీర వేసి పచ్చడి నాకిష్టమని నీకు తెలుసు. వీడి కోరిక ఎందుక తీర్చాలీ అని నీకు గీర్వాణం... అవి నాడి, పుచ్చాక అప్పుడు కోసి వండిపెడతావు రుచీ పచీలేకుండా. వండమన్నప్పుడు వండు... జవాబివ్వకు - పొరుగింటిగాలి తగిలింది... కబుర్లు చెప్పేవాళ్ళేకానీ నిన్నాదుకునే వాళ్ళు లేరని తెలుసుకో. పచ్చడి చేస్తేగానీ నేను తినను.'' వనజ భర్త.

''మధ్యాహ్నం పన్నెండయింది. ఏమిటా పంతం.. తినకపోతే మానెయ్యండి - నేనేం ఫలహారం చేశానా... శోష వస్తోంది.. ఎప్పుడు ముద్ద మింగుదామా అని నేను చూస్తుంటే ఇంకా పచ్చడి కావాలట... పచ్చడి.''

''అట్లా నోరు పెట్టుకుని అరవకపోతే... చేతులకి పనిచెప్తే... పచ్చడి అయిపోయేదిగా!

''మగాణ్ణి నామాటే చెల్లాలని మీకు పంతం.. వెధవ కాపురం... ఇష్టం

లేకపోయినా తప్పదు... వొళ్ళేకాదు... మనసూ... అన్నీ అమ్మేసుకున్నాను తాళికోసం... ఇంతకంటె విడాకులు పుచ్చుకుని నేను నా దోవ...

''ఆ... పుచ్చుకో విడాకులు... ఆధునిక నారీమణి, వీరవనిత వచ్చిందని అందరూ నిన్ను సన్మానం చేస్తారు... చూస్తున్నావుగా ఆవిడని...''

''ఆవిడనేం అనకండి...''

''ఆవిడనంటే నీకేం నొప్పి... నీకూ అట్లాగే ఊరేగాలని ఉంది...''

వరండాలో కూర్చున్న భర్తకి కనిపించలేదుకానీ - గోడమీంచి ప్రక్క ఇంట్లో ఎండలో కూర్చుని తలారబెట్టుకుంటున్న ''ఆవిడ'' వనజకి కనిపించింది. ఆవిడ తనని చూసింది. అంతేకాదు ఆవిడ నవ్వుతోంది... వనజ సిగ్గుతో తల ఒంచుకొంది. ఆవిడ అంతే నవ్వుతూ ఉంటుంది. ఎవరేమన్నా నవ్వుతుంది.

ఇప్పుడు మా ఇద్దరి సంభాషణ వింది... అనుకుంది.

''చాల్లెండి నిర్వాకం. లోపలికెళ్ళండి. చేస్తాను. పచ్చడీ చేస్తాను.. పాయసం చేస్తాను. చెయ్యక చస్తానా? మీకు తప్పుతుందిగానీ నాకు తప్పదు...''

ఆవిడ ఒంటరిగా ఉంటుంది. ఆఫీసులో పని. కుర్రాడు ఒకడు వంటా, పనీ చేస్తాడు. ''ఆవిడ ఇంటికి ఎవరెవరో వస్తారు... మగాళ్ళు ఎక్కువగా వస్తారు... గృహిణిలు రారు సాధారణంగా. ఆడవాళ్ళు వస్తే ఏ ఉద్యోగస్తులో... అయివుంటారు.

చుట్టుప్రక్కలవాళ్ళంతా ''ఆవిడ మొగుడికి డైవోర్స్ ఇచ్చేసింది... పిల్లల్ని వొదిలేసింది... ఉద్యోగం చేస్తోంది... మంచిది కాదు అని చెప్పుకుంటారు.

వనజ కూడా అట్లాగే అనేది కానీ ఒకరోజు పిల్లకి జ్వరంతో ఫిట్ వచ్చి గాబరాపడుతుంటే గొడవ చూసి ఆవిడ వచ్చి సేవ చేసింది. డాక్టర్ దగ్గరికి తీసికెళ్ళింది. పిల్ల దక్కింది. ఆ కృతజ్ఞతతో వాళ్ళింటికి వెళ్ళింది ఒకసారి... అంతే ఏమిటో ఆకర్షణ... అప్పుడప్పుడు వెడుతుంది.

ఎవరేనా ఏమన్నా అనుకుంటారేమో, అనుకోనీ అనుకుంటూంది.

* * *

భర్త భోజనం చేసి ఆఫీసుకెళ్ళాడు. పిల్లాడు నిద్రపోతున్నాడు. ఇంకో గంటకి కాని లేవడు. తమ్ముణ్ణి చూస్తుండమని కూతురికి చెప్పింది. -

- పక్క ఇంటికెళ్ళి తలుపు తట్టింది. తలుపు తీశాడు కుర్రాడు.

తన అడుగుల చప్పుడు విని

''రా వనజా... అని పిలిచిందావిడ...''. ఆ ఇల్లు తమ ఇంటికంటె పెద్దది కాదు.

కానీ ఏదో మహల్లోకి అడుగుపెడుతున్నట్లు ఉంది. కర్టెన్లు, అలంకరణతో శుభ్రంగా ఉంది. ఆ గదిలో ఇస్త్రీ దుప్పటితో పరిశుభ్రంగా మెరిసిపోతున్న పక్క దిళ్ళూ... పడుకుని ఉందావిడ.. జుట్టు పొడవుగా భుజంమీంచి ముందు పడుతూ... మహారాణి అనిపిస్తోంది.

''రా, కూర్చో...'' ఆ మంచంమీదే చోటిచ్చింది.

''మీ వారు వెళ్ళారా-'' పలకరించింది.

''ఊ...'' మాటలు పెగలటం లేదు. దేవుని విగ్రహము ముందు నుంచున్నట్లు లోపల ఏవేవో చెప్పుకోవాలని.. తన ఆరళ్ళు చెప్పుకోవాలని... ఎన్నెన్నో తెలుసుకోవాలని... కానీ దోవ కనిపించటం లేదు...

''బాబు పడుకున్నాడా?''

''ఊఁ...''

నవ్వుతూ తన కళ్ళలోకి చూస్తోందావిడ - ఆ కళ్ళకి తెలీనిదేమిటి? తనకి ఆవిడముందు సిగ్గెందుకు?

''విన్నారా మా మాటలు'' అంది బాధని అణచుకుంటూ

''ఆ...'' అంది.

''మీకు అసహ్యాం వేస్తుందేమో మా బతుకులు చూసి... దెబ్బలాడుకుంటూ విడిపోలేక.. కలిసి ఉండలేక.. నవ్వుకుంటారు కదూ!

''అసహ్యామెందుకూ... ఇది జీవితం... అందరికీ గొప్పగానే బ్రతకాలని ఉంటుంది. కానీ సాధ్యంకాదుగా... ఉన్నదానితో సరిపెట్టుకోవాలి తప్పదు... అతడికీ ఉంటాయి కోరికలు... పాపం అతనూ సర్దుకుపోతూనే ఉంటాడేమో!

''కానీ ఆడది తలవంచినట్లు అతడికవసరం లేదు... ''ఆత్మాభిమానం చంపుకోకపోతే, అబద్ధమాడకపోతే రోజు గడవదు.. ఈ మొగుడూ వద్దూ, పిల్లలూ వద్దు ఎక్కడికైనా లేచిపోదాం అనిపిస్తుంది ప్రాణం... అతడికి నామీద ప్రేమా? నేనుపోతే ఇంకొకతిని చేసుకుంటారు. మెట్రిక్ చదువుకున్నాను. నా పొట్ట నేను పోషించుకోగలను...

మనసులో విరక్తంతా మాటలలోకి వచ్చేసింది.

''కానీ మనిషికి తిండీ, గుడ్డా చాలవు కదు వనజా. ప్రేమ కావాలి, అనురాగం కావాలి. ఆత్మీయత కావాలి... ఐశ్వర్యం కావాలి... పిల్లలు కావాలి''.

''ఏం లేకపోయినా ఫరవాలేదుగానీ బానిసత్వం మాత్రం భరించటం కష్టం. నాస్థితి బానిసత్వం కన్నా ఏంబాగుంది... రోజంతా కీచులాడుకోవటం.. మళ్ళీ అతడికి లొంగిపోవటం... అసహ్యంగా ఉంటుంది. మీరు అందుకే నన్ను చూసి నవ్వుకుంటారు. నాకు కూడా స్వతంత్రంగా... మీలాగ ఉండాలని ఉంటుంది.

''నాలాగా...''

''ఊ మీకేం తక్కువ! ఏబాదరబందీ లేదు. ప్రేమగా ఉంటే అర్థం ఉందికానీ, పురుగుకంటే హీనంగా చూసే మొగుడికి లొంగి ఉండటం... ఏ జన్మలో చేసిన పాపమో!''

''నిజమే ప్రేమ కావాలి... స్త్రీకీ కావాలి, పురుషుడికీ కావాలి. దానికోసమే ప్రతిఒక్కరూ పెళ్ళి చేసుకుంటారు. ఒక సంసారం ఒక ఇల్లు ఏర్పరచుకుంటారు. కానీ జీవితమంటే మొగుడి జీతం, భార్య సహనం, ఇద్దరి సహకారం చుట్టూ సంఘం. ఇన్ని శక్తుల ఒత్తిడిమధ్య పూవులాంటి ప్రేమ ఎక్కడ మిగులుతుంది - తప్పు వ్యక్తులది కాదు. నీదీకాదు... నీభర్తదీ కాదు.'' వనజ ఆశ్చర్యపడింది. శ్రద్ధగా వింటోంది.

''నాకేం తక్కువ! భర్తని వదిలేశాను... సంఘ దూరురాలని.

పిల్లల్ని విడిచిపెట్టాను - హృదయంలేని స్త్రీని.

స్వతంత్రురాలు అంటున్నావు నువ్వు - అందరూ మంచిదికాదు అంటారు... అట్లా అంటుంటే నవ్వుకోగలవా? బాధపడకుండా.

నీకు స్వతంత్రం కావాలా?

సంప్రదాయం ప్రకారం కట్టించుకున్న సూత్రాల్ని తీసెయ్యగలవా?

నేను లేకపోతే నాపిల్లలేమైపోతారో అన్న బెంగని గెలవగలవా?

నిన్ను నువ్వు పోషించుకోగలవా?

ఎవరు పలకకపోయినా తినడానికి తిరగటానికి ఆస్తి ఉందా?

ఒకవేళ ఉద్యోగం పోతే ఆఫీసరుకి నీ శరీరాన్ని అర్పించి ఉద్యోగం నిలబెట్టుకోగల ధీమా ఉందా?

భర్త తిరిగి వచ్చి మంచిమాటలు చెప్తే మెత్తబడకుండా ఉండగలవా?

దక్కిందే చాలు అని కక్కుర్తిపడకుండా ఉండగలవా?

కష్టాలు వస్తాయని భయాన్ని జయించగలవా?

వనజ కళ్ళు విచలితమవుతున్నాయి...

''నీ స్వంతవాళ్ళెవరూ నీకేమీ కారు అనుకోగలవా?''

వాళ్ళింటికి చుట్టాలెవరూ రారు.

''నీకేమీ కాని పరాయివారిని నీవాళ్ళలాగ చూసుకోగలవా?''

పని కుర్రాడికి జ్వరం వస్తే ఆవిడ కాళ్ళు పిసికిందని చెప్పుకున్నారు.

''ఒక వ్యక్తి నిన్ను ఆకర్షిస్తే ఏ ఇచ్చిపుచ్చుకోవడాలూ లేకుండా అతడిని తాళి కట్టమనకుండా నీ తనుమనధనాలు అర్పించగలవా? తిరిగి అతడు నీవైపు చూడకపోతే కన్నీరు కార్చకుండా ఉండగలవా? చిరునవ్వుతో వీడ్కోలు చెప్పగలవా?

''అతడిమీద నీకు కోరిక కలగకపోతే నీ భర్తైనాసరే, అధికారైనా సరే తిరస్కరించగలవా?''

అందుకే కాబోలు స్నేహితులంటూ వచ్చినవాళ్ళు మళ్ళీరారు ఈవిడ ఇంటికి – ''ఒకరో ఇద్దరో తప్ప.

''నీ ఇంటికి ఎవరూ రాకపోతే, టాగోర్, చలం, రస్సెల్ నా స్నేహితులు అనుకోగలవా?''

వనజ బేలగా చూసింది. ఆవిడ మళ్ళీ నవ్వుతోంది.

''నేను కూడా మొన్నమొన్నటిదాకా మనశ్శాంతి లేదనుకుని, కావాలనుకుని బాబాలవెంట, స్వామీజీల వెంటా తిరిగాను. ఇప్పుడు నవ్వు వస్తుంది.

తెల్లవారుతుండగానే పువ్వు పూస్తుంది... సూర్యుడున్నంతసేపూ...

గాలి పీలుస్తుంది... సూర్యుడు అస్తమించగానే ముడుచుకుంటుంది.

ప్రకృతి ధర్మం జరిగిపోతుంది... ''ఇంత చదువు చదవక్కరలేదు... నీ భర్తని వదిలిపెడితే –

''నాకు తిండీ నిద్రా కూడా వద్దు. ఆ కృష్ణభగవానుని నామస్మరణ చాలు అని 'మీరా'లా అనుకోగలవా?'' అంది.

వనజ కళ్ళలోంచి నీళ్ళు జలజలా రాలాయి.

ఆవిడ వనజ భుజం తట్టింది.

''పిచ్చిపిల్లా... వెళ్ళు... ఫలహారం చెయ్యాలేమో... అతడు వచ్చే వేళయింది.'' అంది.

స్వాతి మాసపత్రిక

28–9–1997

* * * *